ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5★★
జగిత్యాల
జిల్లా వార్తలు
మంగళవారం 1 జూలై 2025

రజక సంఘానికి భూమి కేటాయించాలి

కొడిమ్యాల, జూన్30 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని తిర్మలాపూర్ గ్రామ రజక సంఘానికి భూమి కేటాయించాలని సోమవారం ప్రజా వాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు గ్రామ రజకసంఘం నాయకులు తెలిపారు. గ్రామంలో సంఘానికి సర్వే నెంబరు 68బై29లో రెండు ఎకరాల భూమిని అప్పటి అధికారులు చూపారని వినతిపత్రంలో పేర్కొన్నారు. నెల రోజుల క్రితం ఆ భూమిలో చదును చేసుకోగా ఓ రిటైర్డు ఉద్యోగి తన భూమిలోకి రావద్దని బెదిరిస్తున్నట్లు తెలిపారు. సంఘానికి గతంలో ఇచ్చిన భూమికి హద్దులను ఏర్పాటు చేయాలని గ్రామ రజక సంఘం నాయకులు కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

కోరుట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం కోరుట్ల పట్టణంలోని 17వ వార్డులో వివిధ పార్టీలకు చెందిన సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి జువ్వాడి బదర్స్ పార్టీలోకి ఆహ్వానించారు.

వార్డులో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలో పాల్గొని జువ్వాడి నర్సింగ రావు, జువ్వాడి కృష్ణారావు పీరీలకు మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్కోగ్రబీ, అక్బర్, తిరుమల గంగాధర్ గౌడ్, కొంత రాజంలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పల్లెల్లో స్వచ్ఛత సర్వే


జగిత్యాల రూరల్ మండలం కల్లెడలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న కార్మికులు

- త్వరలో రానున్న కేంద్ర బృందం
- ఎంపిక చేసిన గ్రామాల్లో పరిశీలన
- నెల రోజుల పాటు ప్రక్రియ
- ఉత్తమ ర్యాంకు సాధనకు అధికారుల చర్యలు

జగిత్యాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాలన్నీ స్వచ్ఛంగా విలసిల్లాలనే సంకల్పంతో స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో భాగంగా పారిశుధ్య నిర్వహణను మెరుగు పరిచేందుకు గ్రామ పంచాయతీల్లో కేంద్ర బృందం త్వరలో సర్వే నిర్వహించనుంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అకాడమి ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అనే సంస్థ నుంచి పలువురు ప్రతినిధులు పర్య వేక్షణకు రానున్నారు. చెత్త సేకరణ తీరు, పారిశుధ్య సిబ్బంది చెత్త తర లింపు, ప్రభుత్వ సంస్థల పనితీరు తదితర అంశాలపై నేరుగా ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరిస్తారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆయా గ్రామ పంచాయతీల సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

● అధిక మార్కులకు పురస్కారాలు..

కేంద్ర ప్రభుత్వం గ్రామాలన్నింటినీ పరిశుభ్రంగా మార్చాలనే ఉద్దేశ్యంతో పంచాయతీల మధ్య స్నేహ పూర్వకమైన పోటీతత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకొని మార్కులు కేటాయిస్తూ సర్వే నిర్వహిస్తారు. సర్వేలో భాగంగా మొత్తం 1,000 మార్కులకు ఈ పోటీ నిర్వహిస్తున్నారు. మెరుగైన ర్యాంకులు సాధిస్తే జాతీయ స్థాయిలో పురస్కారం అందజేస్తారు.

● గ్రామాల్లో సర్వే ఇలా...

జిల్లాలో 383 పంచాయతీలు ఉండగా కేంద్ర బృందం ఎంచుకున్న గ్రామాల్లో సర్వే చేస్తుంది. ఆయా గ్రామాల్లో సర్వేకు వెళ్లేముందు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వరు. ఆయా గ్రామాల్లోని 16 నివాస గృహాల ను సందర్శించి వారి అభిప్రాయాలను క్రోడీకరించి పరిశీలిస్తారు. 16 నివాసాల్లో మూడు ఎస్సీ మూడు ఎస్టీ, ఎనిమిది ఇతర కుటుంబాలు, మరో రెండు నివాసాలు అధికారుల నిర్ణయం మేరకు ఎంచుకుంటారు. ఆయా గ్రామాల్లో నెల రోజుల పాటు

- మిగతా 8లో

'చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లత అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, ఎస్సీ సంక్షేమ అధికారి రాజు కుమార్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు టీవీ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 23,400 నూతన రేషన్ కార్డులు

-డీఎస్‌వో జితేందర్‌రెడ్డి

జగిత్యాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 23,400 నూతన రేషన్ కార్డులను, 46,884 వ్యక్తులను రేషన్ కార్డులలో నమోదు చేశామని జిల్లా సివిల్ సప్లయి శాఖ అధికారి జితేందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మీ సేవ కేంద్రాల ద్వారా వచ్చిన నూతన రేషన్ కార్డు దరఖాస్తులను కార్యాలయ సిబ్బందితో ఎప్పటికప్పుడు అప్రూవల్ చేశామన్నారు. జిల్లాలో 592 రేషన్ దుకాణాల ద్వారా ఈనెల 28వ తేదీ వరకు 17,500 మెట్రిక్ టన్నుల మూడు నెలల కోటాకు చెందిన సన్నబియ్యం పంపిణీ పూర్తి చేశామన్నారు. జిల్లాలో 2024 సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు అక్రమంగా బియ్యం రవాణా, విక్రయాలు చేస్తున్న 41 మంది వ్యక్తులపై 6ఏ కేసులు నమోదు చేసి 1,149 క్వింటాళ్ల దొడ్డు బియ్యం, 860.45 క్వింటాళ్ల సన్న బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపుల్లో పారదర్శకత పాటించినట్లు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు సీఎంఆర్ బియ్యం చెల్లించే విధంగా రైస్ మిల్లర్లను ఆదేశించామని ఆయన పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు వివిధ నైపుణ్యాలను అందించడానికి హైదరాబాద్‌లో నాలుగు రోజుల ఉచిత శిక్షణ ఏర్పాటు చేయనున్నట్లు బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సునీత తెలిపారు. 21ఏళ్ల నుంచి 30ఏళ్ల వయస్సు ఉండి, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన ఎంబీసీ అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు జూలై 12లోగా ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణలో సాఫ్ట్‌స్కిల్ శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, రెజ్యూమ్ తయారీ, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూలు, మానసిక ఆరోగ్యం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

'ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి'


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మురళి

కొడిమ్యాల, జూన్30(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఈనెల 7న ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి జిల్లెల్ల మురళి అన్నారు. సోమవారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కమిటీలను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు కోలాపురం రమేష్, నరేష్, కొండాపూర్ గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

'ఉర్దూ మీడియం పోస్టులను భర్తీ చేయాలి'

జగిత్యాలరూరల్, జూన్30 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ అభ్యర్థులు లేక ఖాళీగా ఉన్న ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని పీఆర్‌టీయూఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు బోయినపల్లి ఆనంద్‌రావు అన్నారు. సోమవారం పొలాస లోని ఉర్దూ మీడియం ఎంపీపీఎస్ స్కూల్‌లో నిర్వహించిన జుల్ ఫికర్ ఆలీ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్యాం సుందర్, అబ్దుల్లాబేగ్, ఆత్మచరణ్‌రావు, తస్లీమాపాషా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కోరుట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీవో రామకృష్ణ నిర్వాహకులకు సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక మొమిన్‌పుర, ప్రభుత్వ ప్రాథమిక అయేద్యపట్నంలోని పాఠశాలలను ఎంపీడీవో రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిలువ ఉన్న సరుకులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కొడిమ్యాల, జూన్30 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని తురుకకాశీనగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆర్ఐ కరుణాకర్ మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనం రుచికరంగా తయారు చేస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవి ఉన్నారు.

వన మహోత్సవం

రాయికల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట శ్రీ రాజరాజేశ్వర నాగాలయంలో సోమవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో గులాబీ, మందారం, మారేడు, ఉసిరి, తెల్ల గన్నేరు చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మా, దేవాదాయ శాఖ డివిజనల్ పరిశీలకులు రాజమొగిలి, ఆలయ ఈవో ముద్దం విక్రమ్, ఆలయ చైర్మన్ దానవేని రాము, అర్చకులు రాజరాజేశ్వర శర్మ, పంచాయతీ సెక్రెటరీ రాజేష్, లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, ఏనుగు నాగిరెడ్డి, మాద రమేష్, తునికి రంజిత్, దేవాలయాల సిబ్బంది కూకట్ల రాజేందర్, శివ కేశవ్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

-తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ శంకర్


దీక్షలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ జవ్వాజి శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ శాంతియుత దీక్ష చేశారు. ఈసందర్భంగా ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ జవ్వాజి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని అన్నారు. ఉద్యమ కారులకు ఇస్తామన్న 250 గజాల స్థలం కేటాయించాలని, రూ.25,000 పెన్షన్ అందించాలని, ఉద్యమకారులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, హామీలను నెరవేర్చుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం బాధ్యులు గంగాధర్ నాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కళాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వంలో అయిన నిజమైన ఉద్యమకారులను గుర్తించి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటపాటలతో దీక్ష ప్రాంగణం మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాగుల రాజు, రాష్ట్ర కార్యదర్శి గాజుల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా బాధ్యులు లింగారెడ్డి, ప్రేమ్‌కుమార్, కళాకారులు సతీష్‌తో పాటు ఉద్యమ నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

'వ్యవసాయ యాంత్రీకరణ'కు తుప్పు

- మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రూ.20.15 లక్షలతో యంత్రాలు కొనుగోలు
- షెడ్లు దాటని వైనం

6

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

●ఎస్పీ అశోక్ కుమార్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, జూన్30 (ఆంధ్రజ్యోతి) :ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 11 మంది అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ చేసే దిశగా పోలీస్ అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ అశోక్ కుమార్ స్పష్టం చేశారు.

●పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తివంతమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. పదవీ విరమణ పొందుతున్న జగిత్యాల టౌన్ ఎస్సై మన్మధరావు, ఏఎస్సై ఖాజ నజీముద్దీన్‌లను సోమవారం ఎస్పీ పూలమాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేసి మాట్లాడారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సైదులు, ఆర్ఎస్సై రమేష్ తదితరులు ఉన్నారు.

పద్మశాలి సంఘం మండల కన్వీనర్‌గా సుదర్శన్

కోరుట్ల రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండల పద్మశాలి సంఘం కన్వీనర్‌గా అయిలాపూర్ గ్రామానికి చెందిన అంబల్ల సుదర్శన్‌ను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్ర శ్రీనివాస్ సోమవారం ప్రకటించారు. పట్టణంలోని మార్కండేయ భవనంలో మండల నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అంబల్ల సుదర్శన్‌కు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా రుద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీలను వేసి పూర్తి స్థాయిలో కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని సుదర్శన్‌కు సూచించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకారం అందించిన పద్మశాలి సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మండల కార్యవర్గం

కథలాపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ మండల కార్యవర్గాన్ని నియమించినట్లు మండల అధ్యక్షుడు మారుతి తెలిపారు. ఉపాధ్యక్షులుగా వాల్గోట్ ప్రమోద్, దండిక లింగం, దయ్య లక్ష్మీ, జిల్లా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా నరెడ్ల రవీందర్‌రెడ్డి, గడ్డం జీవన్‌రెడ్డి, కోశాధికారిగా సునీల్, కార్యవర్గ సభ్యులు కరిపె రమ, గంగాధర్, దేశవేని గంగాధర్‌లను నియమించినట్లు ఆయన తెలిపారు.


మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి బ్యాక్ వాటర్, గోదావరి నదిలో జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు చేపలు, రొయ్యల వేట చేయకూడదని జిల్లా మత్స్యకార అధికారి సురేష్‌బాబు తెలిపారు. జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలకు నదుల్లో నీటిప్రవాహం అధికమై చేపలు సహజంగా ప్రేరణ చెంది సంతానోత్పత్తి చేయడం వల్ల చేపల ఉత్పత్తి పెరిగి చేపల వేటపై ఆధారపడే మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఈ సమయంలో చేపల వేటతో తల్లి చేపలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబారిపేటలో సోమవారం కాంగ్రెస్ నాయకులు లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. అంబటి రాజవ్వకు రు. 50 వేలు, షేర్ సాయాబుకు రు. 28,500, రాగుల నర్సయ్యకు రు. 30 వేలు, పల్లెం అనితకు 24,500ల చొప్పున మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల కార్యదర్శి జవ్వాజి రవీందర్, రాచమల్ల నవీన్, ఏఎంసీ డైరెక్టర్ జగన్‌రావు, గౌరయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు'


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్, జూన్, 30 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇళ్లు కట్టుకు నేందుకు మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష రుణం అందింపజేస్తామని ఎమ్మెల్యే అన్నారు. మండల కేంద్రంలో గల రైతు వేదికలో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి, కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వహీద్, ఎంపీడీవో గంగాధర్ పాల్గొన్నారు.

'దశాబ్దాల కల సాకారం'

రాయికల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్నపెల్లి-జగన్నాథ్‌పూర్ గ్రామ ప్రజల దశాబ్దాల కల సాకారమైందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. బోర్నపెల్లి-జగన్నాథ్‌పూర్ వంతెన అతి ముఖ్యమైందని, వంతెన నిర్మాణం కోసం ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులను కలువడం జరిగిందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.17 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేయడంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు సన్మానం చేశారు. జగన్నాథ్‌పూర్ గ్రామంలో అసైన్డ్ ల్యాండ్‌కు పట్టాల విషయంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కోల శ్రీనివాస్, పాదం రాజు, బీర్‌సా కవిత, శ్రీనివాస్, గంగారాం, శంకర్, తులసి, అనిల్, మహాదు, నారాయణ పాల్గొన్నారు.

డాక్టర్స్ డే శుభాకాంక్షలు
జగిత్యాల జిల్లా డాక్టర్లకు, అధికారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు డాక్టర్స్ "డే" శుభాకాంక్షలు..
జగిత్యాల పరిసర ప్రాంత వైద్యులు

"డాక్టర్స్ డే" శుభాకాంక్షలు
జగిత్యాల జిల్లా ప్రజలకు, డాక్టర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు
Happy Doctor's Day
డా॥ యన్. శ్రీనివాస్
యం.డి, డి.వి.ఎల్(ఉస్మానియా), డి.టి.సి.డి (కె.యం.సి)
డర్మటాలజి, వెనియారలజిస్ట్, లెప్రాలజిస్ట్
చర్మవ్యాధుల నిపుణులు, సుఖవ్యాధులు,
కాస్మోటిక్ స్పెషలిస్ట్ & టి.బి. స్పెషలిస్ట్
+బాలాజీ
చర్మవ్యాధుల దవాఖాన
మార్కండేయ టెంపుల్ దగ్గర, జగిత్యాల

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS
CHANGE OF SURNAME
★ I ANUGANDHULA KISHORE S/O. MURALI R/O. H.NO. 2-118, THIMMAPUR VILLAGE, IBRAHIMPATNAM MANDAL JAGITHYAL DIST NOW I CHANGED MY SURNAME AS ENUGANDULA KISHORE S/O. MURALI.
AJK-16859
3+2 స్కీం కలదు
పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి
ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 9985411262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 9985411063
పెద్దపల్లి :- 9550900238

అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్ట్

● 12 తులాల బంగారం, ఒక ద్విచక్రవాహనం సీజ్

● 16 కేసులలో నిందితుడైన మహేశ్‌తో పాటు ఆరుగురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను అరెస్ట్‌చేసి 12తులాల బంగారం, ఒక ద్విచక్రవాహనంను సీజ్‌చేశామని ఎస్పీ మహేశ్ బి గీతే సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పలుజిల్లాల్లో 16కేసులలో నిందితుడిగా ఉన్న జగిత్యాలజిల్లా మెట్‌పల్లి మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన బోదాసు మహేశ్(30), నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన గద్దల స్వప్న, గోత్రాల బాలమణి, కుమార్‌నగర్‌కు చెందిన ఠాకూర్ విశాల్‌సింగ్, జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామానికి చెందిన నేరెళ్ల శ్రీనివాస్, నేరెళ్ల రాణిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. జగిత్యాల జిల్లా వెల్లుట్లకు చెందిన మహేశ్ నిజామాబాద్ జిల్లాకు చెందిన గద్దల స్వప్న, విశాల్‌సింగ్, జగిత్యాల జిల్లా నెరెళ్ల శ్రీనివాస్, రాణి, గోత్రాల బాలమణి అనేవారితో ఒక ముఠాగా ఏర్పడ్డారన్నారు. ఈ ముఠా రాత్రివేళల్లో తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చేసుకొని ఆర్మూర్, నిజామాబాద్, వేములవాడ, కోనరావుపేట, బోయిన్‌పల్లి ప్రాంతాల్లో దొంగతనం చేయడానికి సరైన సమయం కోసం వేచి చూశారు. ఈ ముఠా ఇదేఏడాది మే2,23తేదీలలో వేములవాడ పట్టణంలోని సాయినగర్ ప్రాంతంలో దొంగతనానికి పాల్పడ్డారు. మే 11, 16, 25న, జూన్ 2, 7, 161న ఆర్మూర్‌లో, జూన్12న వేములవాడలో దొంగతనాలకు పాల్పడగా సాంకేతికత ఆధారంగా సోమవారం వేములవాడ అర్బన్‌లోని తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరివద్ద 12తులాల బంగారం, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఈ దొంగల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న వేములవాడ టౌన్‌సీఐ వీరప్రసాద్, ఎస్‌ఐలు అనిల్‌కుమార్, వెంకట్రాజం, కానిస్టేబుల్స్ గోపాల్, పంతులు, లత, సాహెబ్‌హుస్సెన్, దేవేందర్, సంయుద్దిన్‌ను ఎస్పీ అభినందించారు.

దాడి కేసులో ఆరు నెలల జైలు శిక్ష

ఎలిగేడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపల్లి (కట్టకిందిపల్లి) గ్రామానికిచెందిన చింతరెడ్డి రమణారెడ్డి, కొత్తిరెడ్డి రాజిరెడ్డిల మధ్య పాత ఇంటిహద్దుల విషయంలో గొడవల జరిగాయి. కొత్తిరెడ్డి రాజిరెడ్డి, అతని కొడుకు మహేందర్‌రెడ్డి 2016జూన్8న పారతో చింతిరెడ్డి రమణారెడ్డిని తలపై కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. రమణారెడ్డి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు అప్పటిఎస్సై ఎండి.రఫీక్‌ఖాన్ విచారణ జరిపి కేసునమోదు చేసినట్లు ఎస్సైసనత్‌కుమార్ తెలిపారు. సుల్తానాబాద్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి గణేష్ ఇరువర్గాల వాదనను విన్న అనంతరం నేరస్తుడు కొత్తిరెడ్డి రాజిరెడ్డి నేరం రుజువు కావడంతో అతనికి 6నెలల జైలుశిక్ష, 500వందల రూపాయల జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.శ్యాంప్రసాదరావు సాక్షులను ప్రవేశపెట్టి నేరాన్ని రుజువు చేశారు. డీసీపీ పి కరుణాకర్, ఏసీపీ గజ్జికృష్ణ పర్యవేక్షణలో సాక్ష్యం ప్రవేశపెట్టడానికి సహకరించిన సుల్తానాబాద్ సీఐ జి.సుబ్బారెడ్డి, జూలపల్లి ఎస్సై సిహెచ్.సనత్‌కుమార్, ఎలిగేడు ఎస్సై తనుగుల సత్యనారాయణ, కోర్టు కానిస్టేబుల్ బృందాన్ని సీపీ అభినందించారు.

వేములవాడలో నలుగురిపై పీడీ యాక్ట్ అమలు

వేములవాడ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న రౌడీ షీటర్స్, పాతకేసులలో ఉన్న నేరస్థులుపై నిత్యం పోలీసునిఘా ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ మహేష్ బీ గితే అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గంజాయి, హత్యాయత్నం కేసులలో నిందితులుగా ఉండి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నలుగురిపై పీడీయాక్ట్ అమలు చేసినట్లు తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, కోనాయిపల్లికి చెందిన బైరెడ్డి వినయ్, బాలరాజుపల్లి గ్రామానికి చెందిన నేదూరి రాజేష్ గతంలో గంజాయి, హత్యాయత్నం, హత్య కేసులలో నిందితులుగా ఉండి శిక్షలు అనుభవించినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాకపోగా తరుచూ నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వారు వ్యవహరిస్తున్న తీరును పరిగణలోకి తీసుకుని జిల్లా కలెక్టర్ పీడీ యాక్టు ఉత్తర్వులు జారీ చేయడంతో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ నలుగురికి పీడీ యాక్టు నిర్బంధ ఉత్తర్వులను అందజేసి వారిని చర్లపల్లి జైలుకు తరలించారన్నారు.

నగల బ్యాగ్ మరిచిపోయి బస్సు దిగిన మహిళ

● పోలీసుల చొరవతో దొరికిన బ్యాగ్



నగలు, నగదును బాధితురాలికి అందజేస్తున్న డీఎం, పోలీసులు

సుల్తానాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా టేకుమట్ల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన ముంజల సాధన, అత్త, చిన్నారితో కలిసి గోదావ రిఖనిలో కరీంనగర్ వెళ్ళే కరీంనగర్ టు డిపో బస్సు ఎక్కి సుల్తానా బాద్‌కు టిక్కెట్టు తీసుకుంది. సోమవారం ఉదయం ఏడున్నర గంటలకు సుల్తానాబాద్ బస్టాండ్‌లో బస్సు దిగారు. బస్సు వెళ్ళిపోయిన అనంతరం తమ నగల బ్యాగు లేని విషయాన్ని గుర్తించిన బాధితులు లబోదిబోమంటూ బస్టాండ్‌లో రోదించారు. వెంటనే సుల్తానాబాద్ పోలీసులను ఆశ్రయించారు. బస్సు టిక్కెట్టుపై ఉన్న బస్సు నంబర్ ఆధారంగా ఏఎస్‌ఐ కొమురయ్య వెంటనే కరీంనగర్ ఆర్టీసీ అధికారులను ఫోన్‌లో సంప్రదించి బస్సుకండక్టర్ లంకదాసరి బాబు నంబర్ కనుక్కొని బాధితులు పోగొట్టుకున్న బ్యాగు విషయమై తెలిపారు. వెంటనే సదరు కండక్టర్ బస్సులో వెతకగా సీటు కింద నగల బ్యాగు దొరికింది. బాధితులను కరీంనగర్ బస్టాండ్ తీసుకువెళ్లి అక్కడఉన్న పోలీసుల, ఆర్టీసీ కంట్రోలర్ సమక్షంలో కండక్టర్ లంకదాసరి బాబుచే నగల బ్యాగు అందజేశారు. బ్యాగులో రెండు బంగారు గొలుసులు, ఒక వెండి మొలతాడు, సెల్‌ఫోన్, నాలుగు ఏటీఎం కార్డులతో పాటు ముప్పై రెండు వేల 671 రూపాయల నగదు ఉంది. బ్యాగు అప్పగించిన కండక్టర్‌ను,బ్యాగును దొరికేలా సహకరించిన ఏఎస్‌ఐ కొమురయ్యను పలువురు అభినందించారు.

కొలువు కొట్టాలంటే..

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి



ఇంజనీరింగ్ విద్యతోపాటు అదనపు కోర్సులు

చదువుతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు

గణేశ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్.. ఒకప్పుడు డిమాండ్ ఉన్నకోర్సు. ఈ చదువు పూర్తయిందంటే ఉద్యోగం వచ్చినట్లే. జీవితంలో స్థిరపడినట్లే. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. కోర్సు పూర్తయినా ఉద్యోగం వస్తుందనే నమ్మకం లేదు. దీనికి ప్రధాన కారణం కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడమే. కోర్సు ఏదైనా కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాల్సిందే.. అప్పుడే కొలువు దక్కుతుంది.

చదువుకు.. చేసే పనికి ఉండని పొంతన..

ఇంజనీరింగ్ కోర్సు పూర్తయిన తర్వాత యువత ఏదో ఒక చిన్న ఉద్యోగంలో చేరుతున్నారు. ఇక్కడ చదువుకు.. చేసేపనికి పొంతనే ఉండడం లేదు. ఎందుకంటే.. ఇంజనీరింగ్ పూర్తయిన తర్వాత ఏం చేయాలనే అంశంపై చాలా మందికి అవగాహన ఉండడం లేదు. ఫలితంగా కొంత మంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఇతర ప్రాంతాల్లో ఏదో ఒక చిన్న ఉద్యోగం చేస్తూ కాలం గడుపుతున్నారు. ఇంజనీరింగ్ పూర్తయిన తర్వాత కంప్యూటర్ కోర్సులు చేస్తే ఉద్యోగావకాశాలు ఉంటాయి.

ఉమ్మడి జిల్లాలో ప్రతి సంవత్సరం రెండు వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఏటా రెండు వేలకుపైగా విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసుకుని బయటకు వస్తున్నారు. వారిలో 20 నుంచి 30 శాతంలోపే క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు పొందుతున్నారు. మిగతా వారు ఇంజనీరింగ్ పట్టాలతో ఉద్యోగాల వేట ప్రారంభిస్తున్నారు.

● **సీఎస్ఈ గ్రూప్ ..**

ఇంజనీరింగ్ సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్) గ్రూప్ పూర్తి చేసిన విద్యార్థులు ఆరు నెలల నుంచి సంవత్సర వరకు ఉండే కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. బిగ్ డేటా ఎనటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులతో ఉద్యోగావకాశాలు ఉంటాయి.

● **ట్రిపుల్ ఈ**

ఈఈఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) గ్రూప్ పూర్తి చేసిన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి కూడా వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ విద్యార్థులు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కోర్సుతోపాటు పవర్ టెక్నాలజీ సోలార్ కోర్సు చేయాలి. ఈ కోర్సులు 3 నెలల నుంచి 6 నెలల వ్యవధిలో ఉంటుంది.

● **సివిల్ గ్రూప్..**

సివిల్ గ్రూప్ చదివిన విద్యార్థులు స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ రివిట్ ఆర్కిటెక్చర్, రివిట్ స్ట్రక్చర్, ఆటో క్యాడ్ కోర్సులు నేర్చుకోవాలి. వీటి ద్వారా ప్రాజెక్టుల్లో ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరడానికి అవకాశాలు ఉంటాయి.

● **ఈసీఈ గ్రూప్..**

ఈసీఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్) గ్రూప్ చేసిన వారికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు లభిస్తాయి. ఆండ్రాయిడ్ సిస్టమ్, ఈఎల్ఎస్ఐ డిజైన్స్ కోర్సులతో పాటు బిగ్ డేటా ఎనటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ కోర్సులు చేయాలి. ఈ కోర్సులు ఆరు నెలల వ్యవధి కలిగి ఉంటాయి. వీటితోపాటు ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐఓటీ) కోర్సు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

● **మెకానికల్ గ్రూప్ ..**

మెకానికల్ గ్రూప్ విద్యార్థులు రోబోటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోకేడ్, కెటియా కోర్సులు చేయాలి. ఇవి మూడు నుంచి ఆరు నెలల కోర్సులు. ఈ కోర్సులు పూర్తి చేస్తే ఇంటర్వ్యూల్లో ప్రాధాన్యం ఉంటుంది.

చదువు పూర్తయిన విద్యార్థులు వెంటనే కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవాలి. హైదరాబాద్‌లో పలు సంస్థలు ఈ కోర్సులు నిర్వహిస్తున్నాయి. అక్కడే అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ఉంటుంది. కోర్సు పూర్తయిన తర్వాత ఇంటర్వ్యూలకు వెళ్లే అవకాశం ఉంటుంది.

ఇంటర్వ్యూలను ఇలా ఎదుర్కోండి..

విద్యార్థులు ఇంజనీరింగ్‌లో 90 శాతం మార్కులు సాధించినా ఇంటర్వ్యూల్లో వెనుకబడుతున్నారు. ప్రధానంగా సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టెక్నికల్ స్కిల్స్, హ్యూమన్ రిలేషన్స్‌వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. కళాశాలల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రెయినింగ్‌కు తప్పనిసరిగా హాజరు కావాలి. ప్రస్తుతం అన్ని కళాశాలల్లో ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నారు.

ఇతర కోర్సులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రొఫెసర్ యు ఉమేష్‌కుమార్, వీసీ, శాతవాహన విశ్వవిద్యాలయం



ఇంజనీరింగ్ విద్యార్థులు బీటెక్‌తోనే ఆగిపోవద్దు. ఎంటెక్ కూడా చేయాలి. ఇతర కోర్సులపై కూడా అవగాహన కలిగి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి. క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరుకావాలి. చదువుకున్న కోర్సులపై పట్టు ఉండాలి. దీని వల్ల ఇంటర్వ్యూకు వెళ్లినప్పుడు ఆత్మవిశ్వాసంతో జవాబులు ఇవ్వవచ్చు.



అన్న ఇంటిని తగులబెట్టిన తమ్ముడికి ఐదేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అన్నఇంటిని తగులబెట్టిన కేసులో తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన బాలమల్లయ్య అనే తమ్ముడికి అయిదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి లక్ష్మణాచారి సోమవారం తీర్పు ఇచ్చారు. సిరిసిల్లరూరల్ సీఐ మొగిలి వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామానికిచెందిన బాలనర్సయ్య తన భార్యతోకలిసి నివాసం ఉంటున్నాడు. అతనికి తమ్ముడు మల్లయ్యతో భూవివాదాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో అన్నపై కక్షపెంచుకున్న మల్లయ్య జూన్ 12, 2019న రాత్రి 11 గంటల సమయంలో నర్సయ్య ఇంటికి వెళ్లి నిప్పు అంటించాడు. ఈ సంఘటనపై బాధితులు నర్సయ్య తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ శేఖర్ కేసు నమోదుచేసి నిందితుడైన మల్లయ్యను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును అడిషనల్ పిపి వేముల లక్ష్మీప్రసాద్ వాదించగా కోర్టు కానిస్టేబుల్స్ నవీన్, రాజేందర్ 8మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ జడ్జి లక్ష్మణాచారి నిందితుడికి అయిదేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం ఆయన వాహన తనిఖీలను నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు తప్పవని హెచ్చరించారు.

గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణిచంద్

జమ్మికుంట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కల్తీఆహారం తిని ఇద్దరు విద్యార్థులు సోమవారం అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రాత్రి విద్యార్థులు సాంబార్ భోజనం చేశారు. అప్పటి నుంచి 9వతరగతి విద్యార్థులు మణిచంద్, హర్షవర్ధన్‌కు కడుపునొప్పి, వాంతులు మొదలయ్యాయి. మరుసటిరోజు కూడా తగ్గకపోవడంతో ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పాఠశాలకు చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల పరిస్థితి చూసి ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం పెట్టడం వల్లే అనారోగ్యం బారిన పడ్డారని మండిపడ్డారు. తల్లిదండ్రులు సురేష్-శ్వేత తమ కుమారుడు మణిచంద్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో పది మంది విద్యార్థులు ఇలానే అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. అయితే ఇద్దరు విద్యార్థులకు మాత్రమే అలా జరిగిందని, మిగితా విద్యార్థులు అందరూ బాగున్నారని వైస్ ప్రిన్సిపాల్ రామ్‌సింగ్ వివరణ ఇచ్చారు. కొంతమంది తల్లిదండ్రులు తమపిల్లలకు ఆదివారం బయటి నుంచి ఫుడ్ తీసుకువచ్చి తినిపిస్తున్నారని ఆయన తెలిపారు. హర్షవర్ధన్‌ను అతని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్‌కు తీసుకువెళ్లారు.

వావిలాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి 23మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు.

మోహన్ రెడ్డిపై కేసు కొట్టివేత

కరీంనగర్ లీగల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆవరణలో సాక్షులను బెదిరింపులకు గురిచేశారనే ఆరోపణలతో మోహన్‌రెడ్డిపై నమోదు చేసిన కేసును సోమవారం కరీంనగర్ పీసీఆర్ కోర్టు కొట్టివేసింది. ఫైనాన్స్ కేసుల్లో సాక్షులను కోర్టు ఆవరణలో బెదిరింపులకు గురిచేస్తున్నారని కామారపు జ్ఞానేశ్వర్ అనేవ్యక్తి 24నవంబరు 2017న మాజీఎఎస్సై బొబ్బల మోహన్‌రెడ్డి, బొబ్బల లత, బానాల రమణారెడ్డి, అజీజ్, చెక్కుల రాజమల్లు, శ్రీపాల్‌రెడ్డిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విచారించిన కోర్టు మోహన్‌రెడ్డితో పాటు మిగితావారందరిపై కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

బైక్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

● ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామశివారులో మోడల్ స్కూల్‌కు విద్యార్థులను తీసుకెళ్లే బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్కండ్ల గ్రామానికి చెందిన నేదురు సమ్మయ్య వ్యక్తిగత పనుల నిమిత్తం అర్కండ్ల నుంచి గంగిపెల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎరడపల్లి నుంచి ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సు అర్కండ్ల శివారులో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న సమ్మయ్యకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే సమ్మయ్యను కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గల్లంతయిన మత్స్యకారుడి మృతదేహం లభ్యం



రవి(ఫైల్)

గన్నేరువరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): లోయర్ మానేరుడ్యాంలో ఆదివారం చేపల వేటకు వెళ్లి గల్లంతయిన మండలంలోని ఖైలారం గ్రామానికిచెందిన మత్స్యకారుడు గువ్వ రవి మృతదేహం సోమవారం ఉదయం మత్స్యకారుల గాలింపులో లభించింది. మత్స్యకారులు తెప్పపై మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూసి మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రైతును కాటేసిన పాము

ఇల్లంతకుంట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన అంతగిరి శ్రీనివాస్ అనే రైతు పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. శ్రీనివాస్ సోమవారం పొలం వద్ద వ్యవసాయ పనులు చేస్తుండగా పాముకాటు వేసింది. దీనితో అతన్ని ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ప్రభుత్వ ఖజానాకు గండికొట్టిన ఉద్యోగికి మూడేళ్లు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నకిలీజీతాల బిల్లుల తయారు చేసి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టిన ప్రభుత్వ ఉద్యోగికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 10వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. సిరిసిల్లటౌన్ సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రైమరీహెల్త్ సెంటర్‌లో బానోతు నరేశ్ సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బులు కాజేయాలన్న దురుద్దేశంతో జనవరి 2015 నుంచి నవంబరు 2015వరకు వరకు స్టాఫ్ నర్సు మంజుల పేరిట, మార్చి 2015నుంచి నవంబరు 2015వరకు అరుణ అనే స్టాఫ్‌నర్సు పేరిట వారి నెలవారి జీతాలబిల్లులు, లీవ్‌సాలరీ బిల్లుల తయారు చేసి సిరిసిల్ల సబ్ ట్రెజరీ కార్యాలయానికి పంపించాడు. దీంతో రూ.12లక్షలు విత్ డ్రా చేసి జీతం మినహాయింపు రూ. 1,06,194 ఇచ్చిమిగితా రూ.11,05,514 తన ఎస్‌బీహెచ్ బ్యాంకు ఖాతానందు జమచేసుకొని సొంతానికి వాడుకున్నాడు. అయితే స్టాఫ్ నర్సులు మంజులత, అరుణ గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో పని చేయడం లేదని వారు వేరేచోట పనిచేస్తే వారి జీతాల బిల్లులు సంబంధిత ట్రెజరీ ద్వారా డ్రా చేసుకున్నట్లు ఉమ్మడి కరీంనగర్ ట్రెజరీ ఉపసంచాలకుల విచారణలో తేలింది.

ఆయా ఉద్యోగుల జీతాలు జీపీఎఫ్ మినహాయింపులు రెండింతలు రావడంతో అకౌంటెంట్ జనరల్ డిపార్ట్‌మెంట్ వారు గమనించి సంబంధిత అధికారులతో తెలిపారు. విచారణలో సీనియర్ అకౌంటెంట్ బానోత్‌నరేశ్ మోసానికి పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. నరేశ్ సంబంధిత శాఖ వారికి ఎటువంటి అనుమానం రాకుండా తన డ్రాయింగ్ అండ్ డిశ్బార్డ్‌మెంట్ అధికారి డాక్టర్ రమేశ్ సంతకాలతో కూడిన బిల్లులను పెట్టడంతో మంజూరు చేశారు. ఇందుకు సిరిసిల్ల సబ్ ట్రెజరీ సిబ్బంది సంబంధిత బిల్లులు మంజూరు చేసిన సీనియర్ అకౌంటెంట్‌లో గానీ ఎస్టీఓ వారు మోసం గుర్తించలేక బిల్లులు మంజూరు చేశారు.

ఈ విషయమై వెంటనే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిటీఓ కె. శ్రీనివాస్ సంబంధిత అధికారుల మోసాలపై సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదుచేసి నిందితుడైన బానోతు నరేశ్‌పై కోర్టులో చార్జీ షీట్ దాఖలుచేశారు. ఈ కేసులో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ కోర్టులో ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టగా పిపి సందీప్ కేసు వాదించగా పూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ నిందితులపై నేరం రుజువు కావ డంతో సీనియర్ అకౌంటెంట్ బానోతు నరేశ్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 10వేల జరిమానా విధించారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● కుటుంబసభ్యులతో మాట్లాడించి కిందికి దించిన సీఐ



గోపాల్‌ను కిందికి దించి తీసుకువెళ్తున్న సీఐ రాంనర్సింహారెడ్డి

ధర్మపురి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో భార్యతో గొడవపడి గాడిపెల్లి గోపాల్ అలియాస్ గోపి(42) అనే వ్యక్తి సోమవారం సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఫైర్‌స్టేషన్ అధికారి శ్రీకాంత్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని భార్య, కూతురుతో మాట్లాడించి గోపిని కిందికి దించారు. సీఐ రాంనర్సింహారెడ్డి కథనం ప్రకారం.. ధర్మపురి పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన గాడిపెల్లి గోపాల్ టెంట్‌హౌస్‌లో కూలీగా పని చేస్తున్నాడు. గోపాల్‌కు భార్య నర్సమ్మ, కూతురు, కొడుకు ఉన్నారు. మద్యానికి బానిసైన గోపాల్ సోమవారం భార్య నర్సమ్మతో గొడవపడి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సీఐ రాంనర్సింహారెడ్డి వైర్‌లెస్ మైక్ ద్వారా గోపాల్ కూతురు, భార్యతో మాట్లాడించారు. వెంటనే గోపాల్ తనచేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను కింద పడవేశాడు. అనంతరం గోపాల్‌కు సీఐ నచ్చజెప్పడంతో గంట తరువాత టవర్ పైనుంచి కిందికి దిగాడు. వెంటనే గోపాల్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన సీఐ రాంనర్సింహారెడ్డిని, ఫైర్ సిబ్బందిని ప్రజలు అభినందించారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

సిరిసిల్ల క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో గల బెల్ట్ షాప్‌లపై టౌన్‌ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమ వారం రాత్రి ఆకస్మిక దాడులు చేశారు. గ్రామంలోని బత్తిని చంద్రయ్య ఇంట్లో, ఎల్లంకి శ్రీనివాస్ కిరాణ దుకాణంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌లపై దాడిచేసి మూడుబాక్స్‌ల మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బెల్ట్‌షాప్ నడుపుతున్న బత్తిని చంద్రయ్య, ఎల్లంకి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'వ్యవసాయ యాంత్రీకరణ'కు తుప్పు

● మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రూ.20.15 లక్షలతో యంత్రాలు కొనుగోలు

● రైతులకు అవగాహన కల్పించని అధికారులు

● షెడ్లు దాటని వైనం



సత్తక్కపల్లిలోని షెడ్డులో తుప్పు పట్టిన వరి నాటు యంత్రం

మెట్‌పల్లి రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో లక్షల వ్యయం చేసి కొనుగోలు చేసిన వ్యవసాయ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. రైతులకు తక్కువ ధరకే వ్యవసాయ యంత్రాలను అద్దెకు ఇవ్వడానికి గత ప్రభుత్వం 2021-22 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాల ద్వారా మెట్‌పల్లి మండలం కస్టమర్ హైరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయించింది. 20.15 లక్షలతో ట్రాక్టర్, ట్రాలీ, రోటవేటర్, కల్టివేటర్, వరి నాటు, స్ప్రే యంత్రాలను కొనుగోలు చేశారు. వీటిపై మూడు సంవత్సరాల్లో వచ్చిన ఆదాయం 3.78 లక్షల రూపాయలు మాత్రమే. ఏడు లక్షలు వెచ్చించి వరి నాటు యంత్రాన్ని కొనుగోలు చేశారు. దీన్ని కిరాయికి ఇవ్వగా నిర్వహణ ఖర్చులు తీసివేయగా 2,300 రూపాయలు నష్టం వచ్చినట్లు అధికారులు చూపించారు.

రైతులు ఆసక్తి చూపడం లేదు: విమోచన, మెట్‌పల్లి మండల సమాఖ్య అధికారి

ప్రతీ నెల మహిళా సంఘాల సమావేశాల్లో తీర్మానాలు చేస్తున్నాం. అయినా యంత్రాలను వినియోగించుకోవడానికి రైతు లు ఆసక్తి చూపడం లేదు. రైతులు ఉపయోగించుకుంటే లాభం వస్తుంది. ఎవరూ ముందుకు రాకపోవడంతో అవసరమైన వారికి తక్కువ రేటుకైనా ఇస్తున్నాం.

వరి నాటు యంత్రంపై రూ.2,300 నష్టం

రైతులు ఎకరం పొలంలో వరి నాటు వేయాలంటే ఆరు వేల నుంచి ఏడు వేలకు వరకు ఖర్చు అవుతుంది. అదే వరి నాటే యంత్రం వినియోగిస్తే సమయం, ఖర్చు ఆదా అవుతుంది. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చిన్న ట్రాలీతో కూడిన వరి నాటు యంత్రాన్ని ఏడు లక్షల రూపాయలతో కొనుగోలు చేసింది. దీన్ని రెండు సంవత్సరాల క్రితం చింతలపేట గ్రామానికి చెందిన రైతు వినియోగించుకున్నాడు.

అతడి నుంచి ఆదాయం 12 వేల రూపాయలు మాత్రమే వచ్చింది. దానిపై నిర్వాహకులు మాత్రం 14,300 ఖర్చు చేసినట్లు చూపించారు. దీంతో వచ్చిన ఆదాయం కంటే 2,300 రూపాయలు నష్టం చూపుతున్నారు. అప్పటి నుంచి సత్తక్కపల్లి గ్రామంలోని ఓ రైతు షెడ్డులో వరి నాటుతో పాటు స్ప్రే యంత్రాలను ఉంచడంతో తుప్పు పట్టి ఎందుకు పనికి రాకుండా పోయాయి. దీనిపై మండలంలో ఆశించిన స్థాయిలో సెర్ప్ అధికారులు అవగాహన కల్పించలేదు. మహిళా సంఘాల సమావేశాల్లో అధికారులు తీర్మానాలు చేసి చేతులు దులుపుకున్నారు. లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన యంత్రాలు నిరుపయోగంగా మారడంతో మహిళా సమాఖ్య పెట్టిన నిధులు రావడం కష్టంగా మారిందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పాల్గొన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమీకృత కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన బోయినపల్లి మండలం కొదురుపాక వరదవెల్లి, నీలోజిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ గ్రామాల వారీగా నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు పరిహారం రాలేదని, యువతకు పరిహారం రాలేదని కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు, ఆర్టీసీ బస్‌షెల్టర్లు, స్కూల్ బిల్డింగ్ పరిహారాలు రాలేదని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడారు. మానవతా దృక్పథంతో అందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ పరిహారం వచ్చేలా కృషి చేస్తానన్నారు. దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయిస్తానని అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. కొదురుపాకలో గురువారం, వరదవెల్లిలో శుక్ర వారం, నీలోజిపల్లిలో శనివారం, రెవెన్యూ అధికారులు ప్రత్యే శిబిరం ద్వారా సమావేశాలు నిర్వహించి నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని 15 రోజులలో అర్హులైన వారి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. గ్రామాల నిర్వాసితులు తమ సమస్యలపై దరఖాస్తులు చేసుకోవాలని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా హామీనిచ్చారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో ఎస్డీసీ రాధాబాయ్, బోయినపల్లి తహసీల్దార్ నారాయణరెడ్డి, కలెక్టర్ పర్యవేక్షకులు శ్రీకాంత్, నిర్వాసితులు పాల్గొన్నారు.



ప్రాజెక్టులో తేలిన బండలు

నీరు లేక మిడ్ మానేరు వెలవెల

ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల పైనే ఆశలు

బోయినపల్లి జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల వర్షాకాలంలో జూన్ మాసం ముగిసింది. వర్షాలు లేక పోవడంతో రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులకు నీటిని తరలించేందుకు గుండెకాయగా మారిన మిడ్ మానేరు ప్రస్తుతం నీరు లేక వెలవెల బోతోంది. జూన్ నెల ముగియగా ప్రాజెక్టులోకి చుక్క వరద నీరు కూడా చేరలేదు. మిడ్ మానేరు ఎగువ భాగాన సైతం ఆశించిన వర్షాలు కురువకపోవడం మానేరు, మూలవాగు ప్రవహించ పోవడంతో ప్రాజెక్ట్‌లోకి వరద నీరు రాలేదు.

లోయర్ మానేరు, అనంతగిరి, రంగనాయక సాగర్, కొండ పోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టు సైతం ప్రధానంగా మిడ్ మానేరుపైనే ఆధారం. మిడ్ మానేరు పూర్తి స్థాయిలో నిండు కోవాలంటే కాళేశ్వరం నుంచి నీటిని తరలించే అవకాశం లేకపోవడంతో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులపైనే ఆశలు ఉన్నాయి. మిడ్ మానేరు నీటి సామర్థ్యం 27.55 టీఎంసీలకు ప్రస్తుతం 6.92 టీఎంసీ నీరు ఉంది.

నేడు బాబ్లీ గేట్ల ఎత్తివేత

ఎస్సారెస్పీకి పైన నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్ర, తెలంగాణ ఇరిగేషన్ శాఖ అధికారులు జూలై 1నుంచి అక్టోబరు 28 వరకు తెరిచి ఉంచుతారు. దీంతో మహారాష్ట్రలో భారీ వర్షాలు కురిస్తే ఎస్సారెస్పీ త్వరితగతిన నిండుతుంది. అక్కడి నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా ఎత్తిపోతలు లేకుండా వరద నీరు మిడ్ మానేరులోకి చేరుకుంటుంది.

ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం

కడెం ప్రాజెక్టు నిండితే అక్కడి వరద నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వస్తుంది. అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా నంది మేడారం అక్కడి నుంచి గాయత్రి పంప్‌హౌస్ ద్వారా మిడ్ మానేరుకు తరలించే అవకాశం ఉంటుంది.



ఇందిరమ్మ వరద కాలువ

బెల్ట్ షాప్ తొలగించాలని మహిళల ఆందోళన



బెల్ట్ షాప్‌ను తొలగించాలని పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన కాలనీవాసులు

సిరిసిల్ల క్రైం జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట శివారులో గల కరీంనగర్ రహదారి పక్కన ఉన్న ఒడ్డెర కాలనీలో బెల్ట్‌షాప్ తొలగించాలని సోమవారం కాలనీ మహిళలు ఆందోళన చేశారు. తమ కాలనీలో ఉన్న బెల్ట్‌షాప్‌ను వెంటనే తీసివేయాలని కాలనీకి చెందిన మహిళలు పోలీస్‌స్టేషన్‌కు, ఎక్సైజ్‌స్టేషన్‌కు తరలివచ్చి వినతిపత్రం అందజేశారు. కాలనీలో కొంతమంది వ్యక్తులు కలిసి బెల్ట్‌షాప్ ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు చేస్తున్నారని, మద్యం తాగేవారి వల్ల మహిళలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే బెల్ట్ షాప్ తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

అసత్య ప్రచారం చేస్తే చర్యలు

సిరిసిల్ల క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో బెల్ట్ షాప్ నడుపుతున్నట్లు అసత్య ప్రచారం చేస్తే చర్యలు తప్పవని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. సోమవారం చంద్రంపేటలోని ఒడ్డెర కాలనీకి వెళ్లి తనిఖీలు చేయగా ఎలాంటి బెల్ట్ షాప్ నడుపడం లేదని తేలిందని తెలిపారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేసినా, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే చంద్రంపేటకు చెందిన కొంత మంది మళ్లీ బెల్ట్‌షాప్‌లను నడుపుతున్నట్లు చెబుతూ ఆ సెంటర్‌లో న్యూసెన్స్‌కి కారణం అవుతున్నారన్నారు. గత నెల రోజుల క్రితం చంద్రంపేటలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలుసుకొని సంపంగి లక్ష్మిని బైండోవర్ చేశామన్నారు. గతంలో బెల్ట్ షాప్ నడుపుతున్నారని చంద్రంపేటలోని ఒడ్డెర కాలనీకి చెందిన సంపంగి మల్లవ్వ, సంపంగి లక్ష్మి, సంపంగి రాధ, సంపంగి రాజలింగంలను ఫిబ్రవరి 13న బైండోవర్ చేశామన్నారు. ఇప్పటివరకు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో సంపంగి మల్లవ్వపై 6, సంపంగి లక్ష్మిపై 7, సంపంగి రాధపై 2, సంపంగి రాజలింగంపై 1 కేసు నమోదై ఉందన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వారి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పుణ్య స్నానాలు ఆచరించారు. క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులను చెల్లించుకున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నేతన్న చౌక్‌వద్ద కూలిన వృక్షం

త్రుటిలో తప్పిన ప్రమాదం

సిరిసిల్ల క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల నేతన్న చౌక్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ సమీపంలో సోమవారం రాత్రి భారీ వృక్షం నేల కూలింది. తృటిలో ప్రమాదం తప్పింది. అయితే ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురువడంతో ఏళ్ల నాటి పురాతన వృక్షం విరిగి నేలపై కూలింది. చెట్టు కూలిన సమయంలో వర్షం పడడంతో అటువైపుగా వెళ్తున్న కొంతమంది ప్రజలు తప్పించుకుని ప్రమాదం నుంచి బయటపడ్డారు. చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నేలకూలిన వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఈదురు గాలులతో తెగిన కరెంటు తీగలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మండల కేంద్రంలోని పాత బస్టాండు, విద్యుత్తు సబ్‌స్టేషన్ ఆవరణలో భారీగా వీచిన గాలులకు కరెంటు తీగలు రాపిడి జరిగి నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు భయాందోళనతో పరుగులు తీశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రమాదం తప్పినట్లయింది.

ప్రైవేటు స్కూల్ బస్సులను అడ్డుకున్న గ్రామస్థులు



ఉల్లంపల్లిలో ఆందోళన చేస్తున్న మహిళలు

- సర్కారు బడిని బతికించుకుంటామన్న మహిళా సంఘాలు
- రెండు గంటలపాటు రోడ్డుకు అడ్డంగా బైఠాయించి ఆందోళన

చిగురుమామిడి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో సోమవారం వివిధ గ్రామైక్య మహిళాసంఘాల ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల బస్సులను అడ్డుకొని అందు లోని విద్యార్థులను కిందికి దించారు. రెండు గంటలపాటు స్కూల్ బస్సులను కదలనీయకుండా రోడ్డుకు అడ్డంగా బైఠాయించి ఆందోళన చేశారు. కొద్ది రోజుల క్రితం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గ్రామంలోని మహిళా సంఘాలకు, నాయకులకు ప్రభుత్వబడుల ఆవశ్యక తను వివరించారు. దీంతో సోమవారం నుంచి గ్రామంలోని అన్ని మహిళా సమైక్య సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వబడిని బతికించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామం నుంచి దాదాపు 30మంది విద్యార్థులు సమీపం లోని హుస్నాబాద్ ఇతర ప్రైవేటు పాఠశాలలకు బస్సులలో వెళుతున్నారు. గ్రామస్థులందరూ ఏకమై ఆయా పాఠశాలల బస్సులను గ్రామానికి రానివ్వవద్దని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా సోమవారం గ్రామానికి వచ్చిన స్కూల్ బస్సులను అడ్డుకున్నారు. గ్రామానికి రావద్దని బస్సు డ్రైవర్లను హెచ్చరించారు. అడ్డుకున్న వారిలో బీఆర్ ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ నాయకులు, మాజీసర్పంచులు, ఎంపీటీసీ, మహిళాసంఘాల సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్, యువజన సంఘాలు, గ్రామస్థులు తదితరులున్నారు.

సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక పోస్ట్‌లు

ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వానికి వ్యతి రేకంగా పోస్టులు పెట్టిన రంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని శేర్‌లింగంపల్లికి చెందిన దుర్గం శశిధర్‌గౌడ్ అలియాస్ నల్ల బాలు (38)ను సోమవారం కరీంనగర్ సైబర్ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు.

అనంతరం నిందితుడిని కరీం నగర్‌కు తీసుకొచ్చి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. శశిధర్‌గౌడ్‌ను అరెస్టు చేశారనే విషయం తెలుసుకున్న కరీంనగర్ బీఆర్ఎస్ నాయకులు పలువురు పోలీస్ కమిషనరేట్ వద్దకువెళ్లి నిరసన తెలిపారు.

ముల్కనూర్ బ్యాంకు అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి ఎన్నిక



మాట్లాడుతున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడిగా అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ముల్కనూర్ బ్యాంకు అధ్యక్ష ఎన్నిక జరిగింది. ప్రవీణ్‌రెడ్డి ఒక్కరే అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కోదండరాములు ప్రకటించారు. అనంతరం ప్రవీణ్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ 1987 నుంచి తాను ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నట్లు తెలిపారు. తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లు ప్రవీణ్‌రెడ్డి, బొల్లంపల్లి కుమారస్వామి, గణవేన శ్రీనివాస్, గుర్రాల భాస్కర్‌రెడ్డి, కాసిరెడ్డి వసంతలతో ఎన్నికల అధికారి కోదండరాములు ప్రమాణస్వీకారం చేయించారు. ముల్కనూర్ బ్యాంకు ఉపాధ్యక్షుడిగా గజ్జి వీరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి కోదండరాములు గజ్జి వీరయ్యతో ప్రమాణస్వీకారం చేయించారు.

చిన్నపాటి వర్షాలకే చిత్తడయిన రోడ్లు





కోర్కల్-శ్రీరాములపేట గ్రామాల మధ్య రోడ్డుపై ఏర్పడిన గుంతలు, రెడ్డిపల్లిలో అధ్వాన్నంగా రోడ్డు

వీణవంక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోడ్లు అధ్వానంగా మారాయి. జమ్మికుంట-కరీంనగర్ ప్రధాన రహదారిలో ప్రయాణం ప్రమాదకారంగా మారింది. రాత్రి వేళలో ప్రయాణించే ప్రయాణికులు తరుచు ప్రమాదాలకు గురవుతున్నారు. రెడ్డిపల్లి, కోర్కల్, చల్లూరు, మాల్లారెడ్డిపల్లి గ్రామాల రోడ్లు పూర్తిగా ధ్వంస మవడంతో భారీ గుంతలు ఏర్పాడ్డాయి. చిన్నపాటి వర్షాలకే నీరు నిండడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ప్రతి రోజు వందలాది ఇసుక లారీలు, ట్రాక్టర్లు ప్రయాణించడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అధికారులు రోడ్ల మరమతులపై దృష్టి సారించడం లేదని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వర్షాలకే పరిస్థితి ఇలా ఉంటే భారీ వర్షలు కురుస్తే ఇంకెంత దెబ్బతింటాయోనని ఆందోళన చెందుతున్నారు.



విద్యార్థులకు వరం ఇన్‌స్పైర్ మనక్

- అవార్డులకు దరఖాస్తులు ప్రారంభం
- చిన్నారులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేసే కార్యక్రమం
- 6నుంచి 12 తరగతులకు అవకాశం
- సెప్టెంబరు 15 వరకు గడువు

కరీంనగర్ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ చర్యలు చేపట్టింది. శాస్త్ర, సాంకేతిక ఆలోచనలు, సృజనాత్మకత వైపు మళ్లించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్ (ఇన్‌స్పైర్) మనక్ అవార్డు (2025-26)కు సంబంధించి.. విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జూన్ 15న ప్రారం భమైన దరఖాస్తుల ప్రక్రియ సెప్టెంబరు 15 వరకు కొనసాగనుంది. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి..

ఇన్‌స్పైర్ మనక్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ సూచిస్తోంది. ఇందుకోసం www. inspireawards. gov.in వెబ్‌సైట్లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంచుకోవాలి. పాఠశాలలకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకొని సేవ్ చేయాలి. ఈ దరఖాస్తు జిల్లా అథారిటీకి వెళ్తుంది. జిల్లా అథారిటీ ఆమోదిస్తే 24 గంటల్లోపు విద్యార్థికి సంబంధించిన మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో ఉన్న లింక్ వస్తుంది. అప్పుడు యూజర్ ఐడీకి పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. విద్యార్థి తన సమాచారం, బ్యాంకు అకౌంట్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్, ఆధార్ కార్డు నంబర్, విద్యార్థి ప్రదర్శించాలనుకున్న ప్రాజెక్టు సంక్షిప్త రిపోర్టు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబరు 15 వరకు అవకాశం ఉంది. విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ఆన్‌లైన్‌లో ప్రాజెక్టు వివరాలు నమోదు చేసుకోవాలి.

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు

విద్యార్థులకు తమకు వచ్చిన ఆలోచనలతో తయారు చేసిన ప్రాజెక్టులు ప్రదర్శించేందుకు ఎంపికైతే వారి అకౌంట్లలో 10 వేల రూపాయలు జమచేస్తారు. వాటిని జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శిస్తారు. జిల్లా స్థాయిలో ఎంపికైతే రాష్ట్ర స్థాయిలో ప్రదర్శిస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించిన ఆరు ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయి ప్రాజెక్టులను ఢిల్లీలో ప్రదర్శించడంతోపాటు రాష్ట్రపతి భవన్‌లోనూ ప్రత్యేకంగా ప్రదర్శిస్తారు. అనంతరం సకురా ప్రోగ్రామ్ ద్వారా జపాన్‌లోని పరిశోధన కేంద్రాలను సందర్శించేందుకు ఎంపికైన విద్యార్థులను పంపుతారు.

ఐడియా బాక్స్

అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల వినూత్న ఆలోచనలను ఉపాధ్యాయులు గుర్తించేందుకు ఐడియా బాక్స్ ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ వేదిక ద్వారా పరిష్కారానికి అవకాశం ఉంది. ప్రతీ పాఠశాల నుంచి కచ్చితంగా ఐదు ప్రాజెక్టులు నామినేషన్ చేసుకోవాలి. ఇన్‌స్పైర్ మనక్ విద్యార్థులకు ఒక వరం వంటిది. శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరుకునే విద్యార్థులకు ఎంతగానో దోహదం పడుతుంది. సామాజిక సమస్యలకు శాస్త్రీయ రూపంలో పరిష్కారం చూపగలిగే సృజనాత్మక ప్రాజెక్టులను నమోదు చేయాలి. అందుకు సైన్స్ ఉపాధ్యాయులు సహకరించాలి.

మా భూములకు నష్టపరిహారం చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న వీర్నపల్లి మండల రైతులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన 9వ ప్యాకేజీ పనులకు తీసుకున్న భూములకు నష్టపరిహారంతో పాటు ఆన్‌లైన్‌లో ఆ భూములకు విముక్తిని కల్పించి న్యాయం చేయా లంటూ రైతులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి ధర్నా చేపట్టారు. వీర్నపల్లి మండలంలో ప్యాకేజీ 9లో భూములు కోల్పోయిన రైతులు కలెక్టరేట్ జంక్షన్‌కు చేరుకుని కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు ర్యాలీ నిర్వహించి బైఠాయించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాను కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాల్లారపు అరుణ్‌కుమార్, పిట్ల నాగరాజు, రాజేశం, దేవయ్య, నర్సయ్య, శంకర్, రాజారాం, లింబయ్య, అనిల్, అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జగిత్యాలరూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన దుమాల రాకేష్ (24) అనే యువకుడు ఆదివారం పెరుకపల్లి రాజీవ్ చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రాకేష్ తన స్నేహితులు సుమన్, కార్తీక్‌తో కలిసి బైక్ నడుపుకుంటూ జగిత్యాల వైపు వస్తున్న క్రమంలో రాజీవ్ చౌరస్తా వద్దకు రాగానే ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు డ్రైవర్ స్పీడ్ బ్రేకర్ల వద్ద ఆకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో బైక్ అదుపుతప్పి రాకేష్ నడుపుతున్న బైక్ బస్సును వెనుకనుండి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రాకేష్‌కు, స్నేహితులు సుమన్, కార్తీక్ బలమైన గాయాలై తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి రాకేష్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య సోని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

ఇద్దరిపై అట్రాసిటి కేసు

మల్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా వావిలాలపల్లికి చెందిన మల్యాల ప్రశాంత్ అనే వ్యక్తి ఓ సంస్థలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తూ ఈ నెల 27న మల్యాలలో విశ్వబ్రాహ్మణ సంఘం వద్ద ఆయన పని చేస్తున్న సంస్థకు సంబందించి సదస్సు నిర్వహించాడు. ఈ సదస్సు వద్దకు వడ్రంగి కులంకు చెందిన బాసోజి గోవర్ధన్, చింతల రాజేశ్వర్ అనే వ్యక్తులు వచ్చి కులం పేరుతో దూషించడమే కాకుండా చేతులతో దాడి చేసినట్లు ప్రశాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రిసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

దాడి ఘటనలో ఇరు వర్గాలపై కేసు

మల్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): భూ తగాదాలలో ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బల్వంతాపూర్ శివారులో గల వ్యవసాయ భూమి విషయమై ముత్యంపేటకు చెందిన కాసారపు శ్రీనివాస్, గంగధర రాజేశం మధ్య ఈ నెల 25న వాగ్వాదం జరిగింది. ఈ ఘర్షనలో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు దాడి చేసుకోగా శ్రీనివాస్ భార్య ఉమ, రాజేశం పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

ఆర్థిక సహాయం

బుగ్గారం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): చందయ్యపల్లె గ్రామానికి చెందిన రాజు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబానికి కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు నగునూరి నర్సాగౌడ్ మృతుడి కుటుంబానికి రూ.2వేలు అందించారు.

'ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి'



రాజారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోస్తున్న అధికారి

ధర్మపురి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈఈ భవాని అన్నారు. ధర్మపురి మండలంలోని రాజారం, ఆరెపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు హౌసింగ్ ఏఈఈ భవాని, కాంగ్రెస్ నాయకులు సోమవారం ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈఈ భవాని మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని కోరారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు నిర్ణయించిన కొలతల ప్రకారమే ఇళ్లు నిర్మించుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పంచాయితీ కార్యదర్శి నరేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు రాందేని మొగిలి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, గ్రామ శాఖల అధ్యక్షులు ఏదులాపురం మహేందర్, కుంబాల మల్లేష్, రంగు అశోక్ పాల్గొన్నారు.

●**గొల్లపల్లి:** పేదల సొంతింటి కల సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జెల్లా అనిల్ కుమార్ యాదవ్ పేర్కోన్నారు. సోమ వారం గొల్లపల్లి మండలం రంగదాముని పల్లె గ్రామంలో ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను స్థానిక నాయకులతో కలిసి టెంకాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు కోస్న హనుమంత రెడ్డి, సామల రాజేశం, భాస్కరాచారి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కమీటీ సభ్యులు అల్లూరి సత్యా నారాయణ రెడ్డి, వేములావాడ మల్లేశం, వేములావాడ మహేందర్, గుంటుకుల రమేష్, కాంగ్రెస్ యువ నాయ కులు జెల్లా అనిల్ కుమార్ యాదవ్, నాయ కులు గడ్డం రాజిరెడ్డి, రాగల్ల మల్లయ్య, మధుకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్రవంతి రాథోడ్ పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మల్లాపూర్ మండల కేంద్రంలోని లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు భూమి పూజ చేశారు. సోమవారం గ్రామంలోని స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల త్వరగా నిర్మాణాలు పూర్తి చేసిన వారికి సకాలంలో బిల్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ కిసాన్ జిల్లా అధ్యక్షుడు ఏలాల జలపతిరెడ్డి, పుండ్ర శ్రీనివాస్‌రెడ్డి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు కోటగిరి ఆనందు, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, రామ లక్ష్మణ్, రాజేశం, మోహన్‌రెడ్డి, మిట్టపల్లి జీవన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి'

కొడిమ్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రైతులకు వంద శాతం రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం రుణ మాఫీపై శ్వేత పత్రం విడుదల చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కొడిమ్యాలలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో సగం మంది రైతులకు మాత్రమె రుణ మాఫీ జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అన్ని రకాల వడ్లకు 500రూపాయల బోనస్ చెల్లిస్తామని ఇప్పుడు సన్న వడ్లకు చెల్లించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం ఒక సన్న రకం వడ్లకు బోనస్ 500 రూపాయలు కాకుండా దొడ్డు రకం వడ్లకు కూడ 500 రూపాయలు బోనస్ చెల్లించాలన్నారు. ఎన్నిలకు ముందు రైతు భరోసాను ఎకరాకు 6వేల రూపాయలకు బదులుగా మొదటి సారిగా 5వేల రూపాయలను చెల్లించి చేతులు ఎందుకు దులుపుకున్నారని ప్రశ్నించారు. రెండవ పంటకు రైతు భరోసాను చెల్లించకుండా, మూడవ పంటకు 3ఎకరాలకు చెల్లించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రైతు భరోసా రైతులందరికీ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పెగడపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన గొడుగు మల్లేశం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. సోమవారం రాత్రి నామాపూర్‌లో బాదిత కుటుంబ సభ్యులను కలసి మల్లేశం మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈశ్వర్ వెంట నామాపూర్ మాజీ సర్పంచ్ ఇనుగండ్ల కరుణాకర్ రెడ్డి, నాయకులు సంతోష్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

●**గొల్లపల్లి:** మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు బోలిశెట్టి లక్ష్మణ్ తండ్రి రాజయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళ వారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు గోస్కుల జలేంధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కాంపెల్లి హన్మండ్లు, మాజీ ప్రజా ప్రతినిధులు బలభక్తుల కిషన్, అలిశెట్టి రవీంధర్, ఓరగంటి అశోక్ రావు, టీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి, నాయకులు పాదం రమేష్, బోలిశెట్టి రవీంధర్ తదితరులు పాల్గొన్నారు.

●**ఎండపల్లి:** మండలంలోని చెర్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త బండి సత్య నారాయణ అల్లుడు పత్తిపాక సుధాకర్ ఇటీవలే మృతి చెందగా మృతుడి కుటుంబాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం పరామర్శించి, మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడు కుటుంబానికి అండగా ఉంటానని భరోసా అందించారు. ఆయన వెంట మండల అధ్యక్షులు సింహాచలం జగన్, మల్లేశం ఉన్నారు.

'దళితులపై వివక్ష చూపితే చర్యలు'



పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

కథలాపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : దళితులను అవమాన పరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మండల రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ నగేశ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెగ్గెర్లలో పౌరహక్కుల దినం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దళితులు, బడుగు, బలహీన వర్గాలను ఆలయాల్లోకి ప్రవేశించకుండా చేయడం, హోటళ్ళలో రెండు గ్లాసుల విధానం అమలు చేయడం నేరమని అన్నారు. ఏదైన ఇబ్బందులు ఎదుర్కొంటే నేరుగా తమకు పిర్యాదు చేయవచ్చని దళితులకు సూచించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల సభ్యులు ఉన్నారు.

●**కొడిమ్యాల:** మండలంలోని తురుకకాశీనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం అధికారులు నిర్వహించారు. గ్రామంలో అంటరానితనం, వివక్ష ఏమైనా ఉందా అని అధికారులు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ. కరుణాకర్, ప్రధానోపాధ్యాయుడు రవి పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** సమాజంలో పౌరులందరు సమానులేనని అసమానతల పేరుతో వివక్షకు గురి చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని పెగడపల్లి గిర్దావర్ జమున పేర్కొన్నారు. మండలంలోని మద్దులపల్లిలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడ విశ్వాసాలను వీడాలన్నారు. అంటరానితనం పేరుతో వివక్షకు గురి చేయడం తగదన్నారు. ప్రతి ఒక్కరు అక్షరాస్యులు కావాలని అన్నారు. సమావేశంలో మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

●**కోరుట్ల రూరల్:** మండలంలోని జోగినిపల్లి గ్రామంలో సోమవారం ఆర్ఐ రాజేందర్‌రావు, ఏఎస్ఐ సత్తయ్యల ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కాంగ్రెస్ నాయకుడు మహిపాల్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

పల్లెల్లో స్వచ్ఛత సర్వే

(5వ పేజీ తరువాయి)

సర్వే కొనసాగుతుంది. అనంతరం కేంద్రానికి నివేదిక అంద జేస్తారు. దాని ఆధారంగా జిల్లాకు స్కోర్, ర్యాంకు ప్రకటి స్తారు. జిల్లాకు మెరుగైన ర్యాంకులు రావాలనే ఉద్దేశ్యంతో జిల్లా ఉన్నతాధికారులు సిబ్బందితో ఇటీవల సమావేశం నిర్వహించి ఎలా ముందుకెళ్లాలో దిశా నిర్దేశం చేశారు.

సర్వేలో పరిగణనలోకి తీసుకునే అంశాలు..

- చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ
- సెగ్రిగేషన్ షెడ్డులో ఎరువులో తయారీ
- ఇంకుడు గుంతల నిర్మాణం
- శుద్ధమైన తాగునీటి సరఫరా, పచ్చదనం
- ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు బహి రంగ ప్రదేశాల్లో పారిశుధ్య పరిస్థితి
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాల అమలు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతాం..

-మదన్‌మోహన్, జిల్లా పంచాయతీ అధికారి



స్వచ్ఛ సర్వేక్షన్-2025లో భాగంగా గ్రామాలను సర్వే చేసేందుకు త్వరలో కేంద్ర బృందాలు జిల్లాకు వస్తాయి. ఈ బృందాలు ఏసమయంలో ఏ గ్రామంలో పర్యటించే సమాచారం ఉండదు. అప్పటికప్పుడు బృందాలు గ్రామాలను సందర్శిస్తాయి. అన్ని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ సర్వేక్షన్ పోటీకి సిద్ధం చేస్తున్నాం.

ప్రైవేటు ఆసుపత్రిలో యువకుడి మృతి

-వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



మృతిచెందిన నర్సయ్య

జగిత్యాల అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఏటీఎం ఆసుపత్రిలో ధర్మపురి పట్టణానికి చెందిన దళిత యువకుడు బత్తిని నర్సయ్య(42) మృతి చెందాడు. బత్తిని నర్సయ్యకు మూత్ర విసర్జన కాకపోవడంతో మొదట జగిత్యాలలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకు వచ్చారు. అయితే ఆ ఆసుపత్రి వైద్యుడు రోగికి డయాలసిస్ చేయాలని ఏటీఎం ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో వెంటనే నర్సయ్యను భార్య గంగు ఏటీఎం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వెంటనే ఆరోగ్యశ్రీ అప్రూవల్ కాదని ఇప్పుడు చికిత్స నిమిత్తం డబ్బులు చెల్లించాలని సిబ్బంది సూచించారు. దీంతో చికిత్స కోసం 15వేల రూపాయలు చెల్లించడంతో పాటు డయాలసిస్ కిట్ కోసం మరో మూడు వేలు చెల్లించి డయాలసిస్‌కు వెళ్ళే సరికి నర్సయ్య అధిక దమ్ము వచ్చి మృతిచెందినట్లు బంధువులు ఆరోపించారు. తాము ఒకటిన్నరకు ఆసుపత్రికి రాగా ఐదు గంటల వరకు చికిత్స ప్రారంభించకపోవడం వల్లనే తన భర్త మృతిచెందాడని మృతుడి భార్య గంగు ఆరోపించింది. నర్సయ్యకు చికిత్స కోసం ఏర్పాట్లు చేసినప్పటికీ ఆలోపే అతడికి తీవ్ర ఆయాసం వచ్చి గుండెపోటుతో మృతిచెందాడని వైద్యురాలు మానస తెలిపింది.

ఏటీఎం ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతో నర్సయ్య మరణించాడని మృతుడి బంధువులు ఆసుపత్రి ముందు చావు డప్పు మోగించారు. సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి నిర్వాహకులు చంద్రశేఖర్‌గౌడ్ రావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు దూమాల గంగరాంతో పాటు మృతుడి బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు.

అల్ఫోర్స్ పాఠశాలలో మెహందీ ఉత్సవం

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక శివవీధి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో మెహందీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆషాడమాసంలో మైదాకుకు ప్రత్యేకత ఉందని, మహిళలు మైదాకు పెట్టుకునేందుకు ఇష్టపడతారన్నారు. ప్రకృతి ఒడిలో లభించే ఈ మైదాకు అలంకరణకు మాత్రమేకాకుండా శారీరక సమస్యలకు సైతం ఔషదంగా పనిచేస్తుందని శాస్త్రాలు పేర్కొంటున్నాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు మెహందీ ఆధారిత నాటికలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


'ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు'



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

కొడిమ్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో స్వరూప అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన కె. సురేందర్, మండలంలోని నమిలికొండ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సాగి రాంకిషన్‌రావులను మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో మల్యాల మార్కెట్ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, కొడిమ్యాల, తిర్మలాపూర్ సింగిల్ విండోల చైర్మన్ రాజనర్సింగరావు, రాజేందర్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏపీవో సతీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, సీనియర్ అసిస్టెంట్ సురేష్, కార్యదర్శుల సంఘం మండల నాయకులు వంశీవర్ధన్, శేఖర్, శ్రీలత, మహేష్, సీఐటీయు జిల్లా కో కన్వీనర్ చంద్రశేఖర్ పాలొన్నారు.

'మహేందర్‌రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం'



మహేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, బంధువులు

పెగడపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో 38 సంవత్సరాలుగా మహేందర్‌రెడ్డి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీ.హెచ్.ఓ గా విధులు నిర్వహిస్తూ సోమవారం పదవీ విరమణ చేస్తున్న గంట్ల మహేందర్ రెడ్డికి మండల కేంద్రంలోని రెడ్డి కళ్యాణ మండపంలో ఉద్యోగ పదవీ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ ఉద్యోగ జీవితంలో సాదారణమేనని, ఉద్యోగి తాను పని చేసిన చోట నలుగురు మన్ననలు పొందినప్పుడే తన ఉద్యోగ జీవితానికి సార్థకత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపెల్లి మోహన్, సింగిల్‌విండో చైర్మన్లు ఓరుగంటి రమణారావు, మంత్రి వేణుగోపాల్, వీర్ల వెంకటేశ్వర్ రావు, పెగడపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ నరేష్, వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసి ఏఎంసీ కార్యదర్శి

జగిత్యాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

బాలుడి వైద్యానికి చేయూత

ధర్మపురి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నిరుపేద బాలుడి వైద్యం కోసం దాతలైన సామాజిక మిత్రులు రూ.1.13 లక్షలు విరాళాలు అందించి అండగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి జిల్లా గూడూరు గ్రామానికి చెందిన మద్దిరాల మనోహర్-సరిత దంపతుల కుమారుడు రిత్విక్ గత 6 నెలల నుండి బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. తండ్రి మనోహర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పేదరికంతో కుమారుడి వైద్యం కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి సామాజిక మిత్రుల ద్వారా విషయం తెలుసుకున్న ధర్మపురి పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ స్పందించి జూన్5 న ఫేస్ బుక్‌లో పోస్ట్ చేసి బాలుడి వైద్యం కోసం సాయం అందించాలని కోరారు. ఫేస్ బుక్ పోస్టుకు స్పందించిన దాతలు రూ.1.13 లక్షల విరాళాలను బాలుడి తల్లి సరిత బ్యాంక్ ఖాతాకు పంపించారు. దాతల విరాళాలతో బాలుడు రిత్విక్‌కు వైద్య సేవలు అందిస్తున్నారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి ఫేస్ బుక్‌లో పోస్టు చేసి విరాళాలు అందించేందుకు కృషి చేసిన సామాజిక సేవకుడు రమేష్‌ను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కోరుట్ల రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యూసుఫ్‌నగర్, ధర్మారం గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్‌ను అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు రణదీర్, జనార్థన్, పరహీనా బేగం, నవీన్, చిరంజీవి, శ్రవణ్, గంథ్రాలయ సంస్థ జిల్లా మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేష్ గౌడ్, ధర్మారం మాజీ ఉపసర్పంచ్ రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

●**మల్యాల:** కొండగట్టు గిరిప్రదిక్షణ ప్రారంభకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ విద్యార్థులకు అందజేస్తున్న నోట్ పుస్తకాలను మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో హనుమాన్ భక్తులు పంపిణీ చేశారు. మద్దుట్ల, రామన్నపేట, గొల్లపల్లి, పోతారం, నూకపల్లి గ్రామాల్లోని పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 200 మంది విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో జయసింహారావు, మహేశ్, నేరెళ్ల సతీష్‌రెడ్డి, కెల్లెటి రమేశ్, వెల్మ లక్ష్మారెడ్డి, పన్నాల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

జగిత్యాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ఇచ్చే దరఖాస్తులకు అధిక ప్రాదాన్యం ఇచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జగిత్యాల జిల్లా కలక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 37 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడతూ అధికారులు శాఖల వారిగా తీసుకున్న దరఖాస్తుపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సోమవాం జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, ఆర్డీఓలు మధుసూదన్, శ్రీనివాస్, జీవాకర్, డిఆర్‌డిఓ పిడి రఘువరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

-ముక్కట్రావుపేట గ్రామస్థులు

తమ గ్రామం ఎల్లంపెల్లి ప్రాజెక్ట్‌లో ముంపునకు గురి అయినది. గ్రామంలోని కొంత మంది లబ్దిదారులకు కూలి వేతనాలు చెల్లించి ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఇళ్ళు నిర్మించి ఇచ్చారు. అయితే గ్రామం ముంపుకు గురైన సమయంలో 18 సంవత్సరాలు నిండిన వారందరికి కూలీ వేతనాలు చెల్లించడంతో పాటు తమ కాలనీలో రాత్రికిరాత్రే గుడిసెలు వేసుకుని స్థలాలను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

వీల్ చైర్ మంజూరు చేయాలి

- బోదనపు స్వరూప, ముత్యంపేట

నాకు కాళ్ళు అసలే పని చేయవు, చేతులను ఆధారం చేసుకుని తిరుగుతాను. అందు వల్ల ఒక వీల్ చైర్ కావాలని దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటికి ఆరు సార్లు ప్రజావాణికి వచ్చి దరఖాస్తు ఇచ్చాను, ఈ సారైనా అధికారులు స్పందించి నాకు వీల్ చైర్ ఇస్తారని ఆశిస్తున్నాను.

పొలాస వ్యవసాయ కళాశాల, పరిశోధనస్థానంలో బదిలీలు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, శాస్త్రవేత్తలను భారీగా బదిలీ చేస్తూ యూనివర్సిటీ అధికారులు ఉత్తర్వులు వెలువరించారు. ఇందులో భాగంగా జగిత్యాల వ్యవసాయ కళాశాలతో పాటు పరిశోధన స్థానం నుంచి అసిస్టెంట్‌లు బదిలీ చేయబడి, ఆ స్థానంలో కొత్తవారిని నియమిస్తూ ఉత్వర్వులు జారీ అయ్యాయి. జగిత్యాల వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహేష్‌ను బెల్లంపల్లికి బదిలీ చేసి, ఆయన స్థానంలో కృషి విజ్ఞాన కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ తిరుపతిని జగిత్యాల వ్యవసాయ కళాశాలకు నియమించారు. ఆర్ఏఆర్ఎస్, జగిత్యాలలో పనిచేస్తున్న డాక్టర్ రజనీకాంత్ ను ఏబసీఆర్పీ, ఏఆర్ఎస్ కరీంనగర్‌గా నియమించారు. జగిత్యాల వ్యవసాయ కళాశాలలో జన్యుశాస్త్రం, మొక్కల పెంపకం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్‌ను బదిలీ చేయగా, వరంగల్ వ్యవసాయ కళాశాల జన్యువిబాగం, మొక్కల పెంపకం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను జగిత్యాల వ్యవసాయ కళాశాలకు నియమించబడ్డారు. జగిత్యాల ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త గోన్యానాయక్ ఏబసీఆర్పీ వరంగల్‌కు నియమించగా, ఆయన స్థానంలో డాక్టర్ సంధ్యాకిషోర్‌ను ఆర్ఎఆర్ఎస్ లో జగిత్యాలలో ఏబసీఆర్పి గా నియమించబడ్డారు. డాక్టర్ రజినీదేవి శాస్త్రవేత్త జగిత్యాల, రాజేంద్రనగర్ హైదరాబాద్‌కు బదిలీ చేశారు. జగిత్యాల వ్యవసాయ కళాశాల విస్తరణ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ సాధ్విని బెల్లంపల్లి కృషి విజ్ఞాన శాస్త్రంకు బదిలీ చేయగా, పొలెం వ్యవసాయ కళాశాల ఎంటమాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్ జగిత్యాల వ్యవసాయ కళాశాల కీటక విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. జగిత్యాల కళాశాలలోని కీటకశాస్త్ర విభాగంలో పనిచేస్తున్న స్వాతిని బదిలీ చేశారు.

పొలెం వ్యవసాయ కళాశాలలో ప్లాంట్ పాథాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా.సుమలతను జగిత్యాలలోని నూనెగింజలు-సీసమ్ ఆర్ఏఆర్ఎస్‌లో ప్లాంట్ పాథాలజీ శాస్త్రవేత్తగా నియమితులయ్యారు. జగిత్యాలలోని వ్యవసాయ కళాశాలలోని క్రాప్ ఫిజియాలజీ విభాగం ప్రొఫెసర్ (సీఏఎస్) డాక్టర్ సైదా నాయక్‌ను హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు బదిలీ చేయగా, రాజేంద్రనగర్‌లో ప్రొఫెసర్(సీఏఎస్) (ఎస్ఎస్ఏసీ) విభాగం అధిపతి హరీష్ కుమార్ శర్మను బదిలీ చేసి, జగిత్యాలలోని ప్రిన్సిపల్ సైంటిస్టును జగిత్యాలలోని ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ పదవికి పూర్తి అదనపు బాధ్యతలు కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

రూరల్ స్టేషన్ ఎదుట ఆందోళన

జగిత్యాలరూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఓ వర్గానికి చెందిన యువతి మతాంతర వివాహం చేసుకోవడాన్ని నిరసిస్తూ యవతి బంధువులు ఆందోళనకు దిగిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రాయికల్ మండలం అల్లీపూర్ కు చెందిన ఓ వర్గానికి చెందిన యువకుడు సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన ఓ వర్గానికి చెందిన యువతి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై ప్రేమించి మతాంతర వివాహం చేసుకొని రక్షణ కోసం జగిత్యాల రూరల్ సీఐ ని ఆశ్రయించారు. పోలీసులు యువతి, యువకుడి కుటుంబాలను పిలిచి మాట్లాడారు. యువతి తమ బంధువులతో వెళ్లటకు నిరాకరించింది. దీంతో యువతి బంధువులు జగిత్యాల రూరల్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో కొంతమేర ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. యువతి బంధువులకు కౌన్సెలింగ్ నిర్వహించి పోలీసులు నచ్చజెప్పారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

రాయికల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తక్కువ బరువు ఉన్న పిల్లలపై శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సీడీపీవో మమత అన్నారు. రాయికల్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సెక్టార్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్‌లు పద్మావతి, సువర్ణ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

కోరుట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నలంద హై స్కూల్‌లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థి జుర్రు ఆకృతి అథ్లెటిక్స్ అండర్ 12 పోటీలలో 60 మీటర్ల పరుగుందేంలో ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయినట్లు పీఈటీ అజయ్ సోమవారం తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో ఆకృతి రాణించి జిల్లా స్థాయిలో రెండవ స్థానం సాదించి సిల్వర్ మోడల్ గెలుచుకొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పీఈటీ అజయ్ తెలిపారు. ఆకృతితో పాటు అమె తల్లి దండ్రులను పాఠశాల ప్రిన్సిపల్ నాగేంద్ర, పీఈటీ అజయ్ సన్మానించి అభినందించారు.